క్లుప్తంగా

నర్సరీల నిర్వహణలో అలసత్వం వద్దు



పాన్‌గల్: నర్సరీల నిర్వహణలో అలసత్వం వహించవద్దని ప్రత్యేకాధికారి లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మండలంలోని బుసిరెడ్డిపల్లిలో సోమవారం నర్సరీని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా మొక్కలకు క్రమం తప్పకుండా నీటిని అందించి, సంరక్షించాలని సూచించారు. అనంతరం డ్రెయినేజీలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలను పరిశీలించి, గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణకు సమష్టిగా ఉద్యమిద్దాం



వీపనగండ్ల: ఎస్సీ వర్గీకరణ కోసం సమష్టిగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల జాతీయ కార్యవర్గ సమావేశాన్ని మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి హాజరుకానున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

గురుకుల ఉపాధ్యాయుల నిరసన



కొత్తకోట రూరల్: పట్టణంలోని ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల (వీపనగండ్ల) ఉపాధ్యాయులు సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ దయాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 1,022 గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 20వేల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నట్లు తెలిపారు. వీరిలో సుమారు 10వేల మందికి పదోన్నతులు ఇవ్వకుండా నూతన నియామకాలు చేపట్టడం తగదన్నారు. జీఓ 317 ద్వారా ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే గురుకుల జేఏసీగా ఏర్పడి ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీఓఏల సమ్మె నోటీస్



పాన్‌గల్: ఐకేపీ వీఓఏల మండల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏపీఎం సక్రూనాయక్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. ఈసందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు రాజయ్యగౌడ్ మాట్లాడుతూ ఈనెల 16 చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో తాము పాల్గొంటున్నట్లు తెలిపారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా వేతనాలు అందించాలని.. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల వీఓఏలు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం

కోడేరు: మండల కేంద్రంలోని బాలికల, బాలుర ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఓ ఉపాధ్యాయుడు విద్యార్థులు హోంవర్కు చేయలేదని గోడకుర్చీ వేయించారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని పిల్లలకు ఎందుకు గోడకుర్చీ వేయించావని ఉపాధ్యాయుడిని ప్రశ్నించారు. కొందరి విద్యార్థులకు కాళ్లు పట్టేయడంతో స్థానికంగా ఉన్న క్లినిక్‌లో చూపించారు. ఈ విషయంపై ఉపాధ్యాయుడు రాంచంద్రయ్యను వివరణ కోరగా తాను మాలలో ఉన్నానని ఎవరిని కొట్టలేదు, తిట్టలేదని వివరించారు. రెండు నిమిషాల పాటు విద్యార్థులకు గోడకుర్చీ వేయించాలనని తెలిపారు.

జీపీలకు భవనాలు కరువు



గౌరిదేవిపల్లి ప్రాథమిక పాఠశాల భవనంలో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం

- నూతన పంచాయతీల్లో నత్తనడకన సాగుతున్న నిర్మాణాలు
- అరకొర వసతులు, అద్దె భవనాల్లో కార్యకలాపాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

గోపాల్‌పేట: కొత్త పంచాయతీలకు సొంత భవనాలు కరువయ్యాయి. దీంతో అద్దె భవనాలు, అంగన్‌వాడీ, పాఠశాల భవనాల్లో పంచాయతీల కార్యకలాపాలు అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. పరిపాలనా సౌలభ్యం కోసం గత ప్రభుత్వం ఆరేళ్ల కిందట పలు గ్రామాలు, తండాలను నూతన పంచాయతీలుగా ఏర్పాటుచేసింది. అన్ని పంచాయతీల్లో అధికారులతో పాటు సిబ్బందిని నియమించింది. ఈక్రమంలో అనేక పంచాయతీలకు పక్కా భవనాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ సభలు ఇతర సమావేశాలు నిర్వహించుకునేందుకు అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో దాదాపు 10 జీపీలకు సొంత భవనాలు కరువయ్యాయి. ఆయా జీపీలకు పక్కా భవనాలు మంజూరైనప్పటికీ.. కొన్ని చోట్ల పనులు నత్తనకడన సాగుతున్నాయి.

ఉమ్మడి మండలంలో ఇదీ పరిస్థితి..

ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో 2019–20 ఆర్థిక సంవత్సరం మంజూరైన గ్రామపంచాయతీ భవనాలకు అప్పటి ప్రభుత్వం రూ.16 లక్షల చొప్పున మంజూరు చేసింది. 2020 తర్వాత మంజూరైన జీపీ భవనాల నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున కేటాయించారు. గొల్లపల్లి, తల్పునూరు గ్రామాల్లో పంచాయతీ కార్యాలయ భవనాలు అందుబాటులోకి వచ్చాయి. గౌరిదేవిపల్లి, కేశంపేట పంచాయతీ భవనాల పనులు చివరి దశలో ఉన్నాయి. త్వరలోనే ఆయా భవనాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. శానాయిపల్లి పంచాయతీ కార్యాలయం పాఠశాల భవనంలో కొనసాగుతోంది. పాటిగడ్డతండా జీపీ భవనం పూర్తి కాగా.. అనంతపురం జీపీ భవనం పనులు కొనసాగుతున్నాయి. లక్ష్మీతండా పంచాయతీ భవనం పనులు ఇంకా ప్రారంభం కాలేదు. కర్ణమయ్యకుంటతండా జీపీ భవనం పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఆయా పంచాయతీ కార్యాలయాలు ఎలాంటి సౌకర్యాలు లేని భవనాల్లో కొనసాగుతుండటంతో అధికారులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మహిళా అధికారులు ఉన్న చోట సమస్య తీవ్రంగా ఉందని పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామపంచాయతీ భవనాల పనులను త్వరగా పూర్తిచేసి, అందుబాటులోకి తేవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

త్వరగా పనులు పూర్తిచేయాలి..



మా గ్రామపంచాయతీ భవన నిర్మాణం ప్రారంభమై దాదాపు నాలుగేళ్లు అవుతుంది. ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదు. గ్రామపంచాయతీ భవనం పూర్తయితే గ్రామ సభ ఇతర సమావేశాలు నిర్వహించుకునేందుకు సౌకర్యంగా ఉంటుంది. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించి, వెంటనే పూర్తయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

– సురేష్‌గౌడ్, కేశంపేట

త్వరలోనే అందుబాటులోకి వస్తాయి..

ఉమ్మడి గోపాల్‌పేట మండలంలోని పాటిగడ్డ తండా, చెన్నారం, రేవల్లి గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చాయి. మిగతావి కూడా మూడు లేదా నాలుగు నెలల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మున్ననూరు గ్రామపంచాయతీకి నిధులు మంజూరు కాలేదు. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.

– భాస్కర్, పీఆర్ ఏఈ, గోపాల్‌పేట

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు

కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకుల స్వయంభూ కల్యాణ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దాదాపు 30 ఏళ్ల కిందట ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరగా.. కొత్త ధ్వజస్తంభం తయారు చేయించి, వేద మంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ఠించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులు కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్, ధ్వజ స్తంభం దాత ఆకుల రాములుయాదవ్, ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, నిర్వాహకులు సురేంద్రాచారి, ప్రకాష్, సత్యారెడ్డి, మన్యం, రంగారెడ్డి, అబ్దుల్లా, కిష్టారెడ్డి, కావలి తిరుపతయ్య, లక్ష్మన్న పాల్గొన్నారు.

ఆది బసవేశ్వరస్వామి ఆలయానికి విరాళం



ఆలయ కమిటీ చైర్మన్‌కు చెక్కు అందజేస్తున్న జగన్నాథం నాయుడు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం ఆది బసవేశ్వర స్వామి ఆలయంలో షెడ్ నిర్మాణానికిగాను సోమవారం సింగిల్‌విండో చైర్మన్ జగన్నాథం నాయుడు రూ.లక్ష 116 విరాళం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో శివస్వాముల సన్నిధానం కోసం షెడ్ నిర్మాణానికి తనవంతు సహకారం అందించినట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ ఆంజనేయులుతో కలిసి షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నందు, రవియాదవ్, గంగాధర్ యాదవ్, శివ, మహేష్, పార్వతీశం, వెంకటాపురం ఎల్లస్వామి, ధర్మరాజు, ఎల్లస్వామి, శివరాజు, మారుతి పాల్గొన్నారు.

మార్కండేయస్వామి ఆలయంలో పూజలు



చౌడేశ్వరిమాతకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

వనపర్తి: భక్త మార్కండేయ జయంతిని పురస్కరించుకొని సోమవారం పద్మశాలీలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కండేయ స్వామికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజ లు చేశారు. మార్కండేయ భక్తి, మృత్యువుతో పోరాడిన ఘట్టాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పద్మ శాలీలు గంజి గోపాల్, నీలినారాయణ, తిరుమల ఊశన్న, శ్రీశైలం, శేఖర్, వెంకట్రాములు, సత్యనారాయణ, రత్నమ్మ, వసంత పాల్గొన్నారు.

చౌడేశ్వరిమాతకు ప్రత్యేక పూజలు

పెబ్బేరు రూరల్: పెబ్బేరులో చౌడేశ్వరిమాత జాతర ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, దయాకర్‌రెడ్డి, వెంకటేష్ సాగర్, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి జములేశ్వరిమాత ఉత్సవాలు





ముస్తాబైన జములేశ్వరిమాత ఆలయం.. అమ్మవారి మూలవిరాట్

అమరచింత: పట్టణ శివారులో వెలసిన జములేశ్వరి మాత ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సోమవారం భక్త మార్కండేయ స్వామి ఆలయం నుంచి పట్టువస్త్రాలు, ఆభరణాలను అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ప్రతి ఏటా నెల రోజులపాటు అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతి మంగళ, శుక్రవారాలలో అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకుంటారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహులు తెలిపారు.

రేపటి నుంచి అబ్దుల్ రహీం ఉర్సు



ఉత్సవాలకు ముస్తాబైన దర్గా

మదనాపురం: మండలంలోని దుప్పల్లిలో బుధవారం నుంచి అబ్దుల్ రహీం ఉర్సు ప్రారంభం కానుంది. కులమతాలకు అతీతంగా నిర్వహించే ఉత్సవాలు మూడు రోజులపాటు వైభవంగా కొనసాగనున్నాయి. మొదటి రోజు గంధోత్సవం నిర్వహించనున్నారు. దర్గా నుంచి గంధాన్ని తలపై పెట్టుకొని మేళతాళాల మధ్య ఊరేగింపు నిర్వహించిన అనంతరం మహబూబ్ సుభాని దర్గాకు చేరుస్తారు. 15న దర్గాను దీపాలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. 16న ఖురాన్ పఠనంతో ఉత్సవాలు ముగుస్తాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దర్గాను దర్శించుకుంటారు. దర్గా ఆవరణలో మిఠాయి, గాజులు, ఆటబొమ్మల తదితర దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు.

పీఠాధిపతుల రాక..

ఉత్సవాలకు తాండూర్ సయ్యద్ అబ్దుల్ కరీం దర్గా పీఠాధిపతులు సయ్యద్ సాబేర్‌పాషా, అజీష్‌పాషాలు హాజరు కానున్నట్లు నిర్వాహకుడు సుకుమార్‌గౌడ్ తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మండలంలోని బుసిరెడ్డిపల్లి, మాందాపూర్ ఉన్నత పాఠశాలలను సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల హాజరు శాతం, పలు రికార్డులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులపై ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతగా ఉండేలా హెచ్‌ఎంలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



పెబ్బేరు రూరల్: పెబ్బేరు పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాల విద్యార్థిని డి.రిషిక రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజేందర్‌గౌడ్ తెలిపారు. ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు సూర్యపేట జిల్లా మల్లారెడ్డిగూడెం మండలంలోని చింతలపాలెంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు నుంచి విద్యార్థిని పాల్గొంటుందని పేర్కొన్నారు. కాగా కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థిని శిరీషను సోమవారం మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు, మాజీ సర్పంచ్ రామన్‌గౌడ్‌తో పాటు పాఠశాల యాజమాన్యం శాలువాతో సత్కరించి అభినందించారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు



కొత్తకోట: పట్టణంలోని సర్వే నంబర్ 362లోగల ఎకరా 17 గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం 11వ వార్డు కౌన్సిలర్ భరత్‌భూషణ్ కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని కొత్తకోటకు చెందిన మాజీ జెడ్పీటీసీ ఆక్రమించుకుని అనుభవిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి అనువైన స్థలాలు లేవని, ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా పట్టణంలోని కోదండరామస్వామి ఆలయం ఎదుట నిర్మించిన సత్రాలను కూడా కబ్జాచేసి, అద్దెకు ఇచ్చారని పేర్కొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

కొల్లాపూర్: పట్టణంలోని పోచమ్మ దేవత బోనాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలను మామిడి, వేప తోరణాలతో అలంకరించారు. మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రంగదాసువీధి, ఆర్టీసీ బస్‌డిపో పక్కన, 16వ వార్డులో, వరిదేల చెరువు కట్టకింద, ఎస్సీ బాలుర హాస్టల్ సమీపంలో ఉన్న పోషమ్మ దేవాలయాలు భక్తులతో కిటకటలాడాయి. అంతకుముందు ఆదివారం రాత్రి కోట మైసమ్మ అమ్మవారికి రైతు సంఘాల ఆధ్వర్యంలో బోనం సమర్పించారు.

క్రీడా ప్రాంగణంలో జొన్నచేను తొలగింపు



మస్తీపురం క్రీడా ప్రాంగణంలో జొన్నపంటను తొలగిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

అమరచింత: మండలంలోని మస్తీపురం క్రీడా ప్రాంగణంలో సాగుచేసిన జొన్న పంటను తొలగించారు. క్రీడా ప్రాంగణంలో జొన్నపంట సాగుచేసిన విషయాన్ని సోమవారం 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై స్పందించిన మండల ప్రత్యేకాధికారి చాంద్‌పాషా, ఏఎస్ఐ జమీరుద్దీన్.. జొన్నపంటను పూర్తిగా తొలగించారు. త్వరలోనే క్రీడా పరికరాలు ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు. వారి వెంట ఎంపీఓ నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి రవి ఉన్నారు.

వలంటీర్లకు పుస్తకాలు, బ్యాడ్జీలు పంపిణీ



వలంటీర్లకు పుస్తకాలు, బ్యాడ్జీలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ సురేష్

వనపర్తిటౌన్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సోమవారం ప్రిన్సిపాల్ సురేష్ పుస్తకాలు, బ్యాడ్జీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. వలంటీర్లు ఎంపిక చేసుకున్న సబ్జెక్టులను బోధించడం వల్ల ఉపాధ్యాయ లక్షణాలు పెరుగుతాయని.. తద్వారా ఉపాధ్యాయ వృత్తిలో సైతం రాణిస్తారని చెప్పారు. ప్రతి శనివారం వారికి కేటాయించిన పాఠశాలలో విద్యాబోధన చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ రూప, మంజుల, అకాడమిక్ కోఆర్డినేటర్ స్వామి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ విష్ణుమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముందుజాగ్రత్తలతో వ్యాధులు దూరం



అవగాహన కల్పిస్తున్న వైఆర్‌జీ కేర్ సంస్థ ప్రతినిధి

ఖిల్లాఘనపురం: ముందస్తు జాగ్రత్తలతో వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని వైఆర్‌జీ కేర్ సంస్థ డీఆర్పీ కాంత్, సూపర్‌వైజర్ కృష్ణ అన్నారు. మండలంలోని మానాజిపేటలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష చూపరాదన్నారు. వ్యాధి నివారణపై పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సరళ, ఏఎన్ఎం నాగలక్ష్మి, హేమలత, లింక్ వర్కర్ కాశయ్య, ఆశాకార్యకర్త జరీనాబేగం, లక్ష్మి, సరోజ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వరిపంటను పరిశీలిస్తున్న ఏఓ డాకేశ్వర్‌గౌడ్



బున్యాదిపురంలో..

వీపనగండ్ల: చౌడు, సల్ఫేట్ దుష్ప్రభావం ఉన్న నేలల్లో యాసంగి వరిసాగు చేసే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి డాకేశ్వర్‌గౌడ్ సూచించారు. సోమవారం గోపల్‌దిన్నె, గోవర్ధనగిరి గ్రామాల్లో వరిపంటను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌడు, సల్ఫేట్ దుష్ప్రభావం ఉన్న నేలల్లో వరిని సాగుచేస్తే పిలకలు సరిగ్గా రాకపోవడం.. మొక్కల పెరుగుదల తగ్గిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. వాటి పరిష్కారం కోసం పొలంలో ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తీసేసి, కొత్త నీటిని అందించాలని సూచించారు. సరైన సమయంలో యంత్రాలతో కాకుండా మనుషుల ద్వారా కలుపు తొలగించాలని తెలిపారు. పంటలో తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శివ, రైతులు ముంత చింతలయ్య, ఈర్ల రమేష్, గుంటి సురేష్ పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: పంటల సాగులో వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించాలని ఏఓ చంద్రమౌళి రైతులకు సూచించారు. పెబ్బేరు మండలం బున్యాదిపురంలో సోమవారం వరిపంటను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిపంటలో ప్రస్తుతం కాండంతొలుచు పురుగు ఆశించడంతో పాటు సూక్ష్మదాతు పోషకాల లోపం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలని సూచించారు. ఏఓ వెంట ఏఈఓ నరేష్, రైతులు బాలరాజుగౌడ్, వెంకటస్వామి, బలరాం, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం పాటిద్దాం



వెల్టూర్‌లో మొక్క నాటుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

కొత్తకోట రూరల్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నిషేధం పాటించాలని మోజర్ల ఉద్యాన కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కోరారు. మండలంలోని కనిమెట్టలో సోమవారం ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ప్లాస్టిక్ వినియోగంతో కలిగే దుష్ఫలితాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం హైస్కూల్ ఆవరణ, రైతు వేదికలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్, ప్రోగ్రాం అధికారిణి బేబి రాణి, మాజీ సర్పంచ్ గాదం రాణి పాల్గొన్నారు.



కనిమెట్ట రైతువేదికను శుభ్రం చేస్తున్న వలంటీర్లు

ఎన్ఎస్ఎస్–2 ఆధ్వర్యంలో..

పెద్దమందడి మండలంలోని వెల్టూర్‌లో ఎన్ఎస్ఎస్–2 వలంటీర్లు ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా అసోసియేట్ డీన్ డా.పిడిగం సైదయ్య మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల అనేక లాభాలు ఉన్నాయని వివరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని తహసీల్దార్ కిషన్‌నాయక్ కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారిణి డా.విద్య, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ రాంచంద్రయ్య పాల్గొన్నారు.

'కృష్ణా జలాలపై మాట్లాడే హక్కు కేసీఆర్‌కు లేదు'



కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

అమరచింత: బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కృష్ణానది జలాలను పక్క రాష్ట్రానికి తరలించిందని.. వాటిపై మాట్లాడే హక్కు మాజీ సీఎం కేసీఆర్‌కు లేదని కాంగ్రెస్‌పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర నాయకుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ ఆరోపించారు. కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగించడంపై మంగళవారం నల్గొండలో బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహించే సభకు నిరసనగా సోమవారం జూరాల ప్రాజెక్టుపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కృష్ణానది నీటివాటల్లో రాష్ట్రానికి వచ్చే భాగాన్ని ఆంధ్ర ప్రభుత్వం అక్రమ ప్రాజెక్టులు కట్టి జలదోపిడీ చేస్తే గొంతెత్తకుండా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయంలో ఉమ్మడి జిల్లాలోని కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా ఎత్తిపోతల పథకాల పనులు 90 శాతం పూర్తిచేస్తే కేవలం 10 శాతం పనులకు పదేళ్ల కాలంలో నయాపైసా కేటాయించకుండా నిర్లక్ష్యం చేసిన బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. 2015, జూన్ 19న కృష్ణా జలాల అగ్రిమెంట్‌పై సంతకం చేసి ఇప్పుడు దొంగనాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, లక్ష్మీకాంత్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, భగవంతు, విష్ణు, హన్మంతునాయక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.